

పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

# సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం

పరిగి, నవంబర్ 28 : సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం పరిగి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు కె.రాములు, యు.శేఖర్, వి.విక్రమ్, ఆనంద్‌కుమార్, వెంకట్రాములుతోపాటు 50 మంది ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొమ్మిదిన్నర ఏండ్లలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి అధిక సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలోనే తామంతా బాగున్నామని, మరోసారి సీఎం కేసీఆర్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌కు మరోసారి పట్టం కట్టండి



మాట్లాడుతున్న క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌రావు

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 28 : రాష్ర్టాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపిన బీఆర్‌ఎస్‌కు మరోసారి పట్టం కట్టేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలని క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతుగా దండుమైలారంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రావు మాట్లాడుతూ... ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లీశ్వరీజంగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్, సహకార సంఘం చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు జగదీశ్, ఐలేశ్, బీఆర్‌ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

# రేపు ఉద్యోగులు, కార్మికులకు సెలవు

**కలెక్టర్ భారతి హోలీకేరి**



ఇబ్రహీంపట్నం, నవంబర్ 28 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 30న పోలింగ్ జరుగనున్న సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించినట్లు రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులకు వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించారని తెలిపారు. కాగా పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లుగా ఎన్నికల నిర్వహణలో భాగంగా వినియోగిస్తున్న విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఈ నెల 29న కూడా సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఆమె పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకులపై కేసులు

**ఎస్పీ కోటిరెడ్డి**



వికారాబాద్, నవంబర్ 28 : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులపై కేసులు నమోదు చేసినట్లు వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సోమవారం రాత్రి బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంత మంది నాయకులు దాడి చేశారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు డబ్బు పంపిణీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు చట్టాన్ని చేతిలోకి తీసుకొని కార్యాలయంపై దాడి చేయడం సరైన పద్ధతి కాదున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే ఎన్నికల కమిషన్, పోలీసులు, డయల్ 100, సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. అందరూ చట్టం పరిధిలో పని చేసి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా చూడాలన్నారు. కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గనుమెన్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారన్నారు. వారి ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

**శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా..**

ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లాలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశామని ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎక్కడా కూడా శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో మొత్తం 555 పోలింగ్ కేంద్రాల్లో 2254 పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న కమాండ్, కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం పోలింగ్ ప్రక్రియను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

# విజన్‌తో సమగ్రాభివృద్ధి

- రూ.40కోట్లతో చెరువుల సుందరీకరణ
- మున్సిపల్, కార్పొరేషన్లలో రూ.వెయ్యికోట్లతో అభివృద్ధి పనులు
- 6వేల మందికి ఇండ్ల స్థలాల పంపిణీ
- బీఆర్‌ఎస్ గెలిస్తేనే మహేశ్వరం నియోజకవర్గం మరింత అభివృద్ధి
- విలేకరుల సమావేశంలో మహేశ్వరం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి



రంగారెడ్డి, నవంబర్ 28(నమస్తే తెలంగాణ) : మహేశ్వరం నియోజకవర్గాన్ని ఓ విజన్‌తో అభివృద్ధి చేశాం. గతంలో ఎన్నడూ జరుగనంత అభివృద్ధి ఈ తొమ్మిదిన్నరేండ్లలో జరిగింది. మున్సిపాలిటీ, కార్పొరేషన్లలోనే రూ.వెయ్యి కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాం. గురుకులాలు, కాలేజీలను ఏర్పాటు చేసి ఈ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చాం. పరిశ్రమలతో ఉద్యోగ, ఉపాధి కల్పించాం. రూ.40కోట్లతో చెరువులను సుందరీకరించడంతోపాటు, అనేక కాలనీలను ముంపు ముప్పు నుంచి బయటపడేశామని మహేశ్వరం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె తుక్కుగూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మెడికల్ కాలేజీని పట్టుబట్టి సాధించామని, మెట్రో రైలు విస్తరణను కూడా చిత్తశుద్ధితో పూర్తి చేస్తామన్నారు. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు డిసైడ్ అయ్యారని, మహేశ్వరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగేందుకు తనను ఆశీర్వదించాలని కోరారు.

**ఇవ్వని హామీలను ఎన్నో నెరవేర్చాం**

ప్రజలకు ఇచ్చిన హామీలతోపాటు ఎవరూ అడుగకున్నా అనేక అభివృద్ధి కార్యక్రమాలను నియోజకవర్గంలో చేపట్టామని మంత్రి చెప్పారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్లలోనే రూ.వెయ్యి కోట్లకు పైగా నిధులను వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రోడ్ల విస్తరణను చేపట్టి రాకపోకలను సులభతరం చేయడంతోపాటు వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీని పెంచామన్నారు.

**అందుబాటులోకి ఉన్నత విద్య..**

పేద విద్యార్థుల కోసం ఎనిమిది గురుకులాలను ఏర్పాటు చేయడంతోపాటు మరో ఎనిమిది గురుకులాల్లో ఇంటర్ విద్యను అందుబాటులోకి తెచ్చినట్లు సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. బీసీలకు డిగ్రీ కాలేజీ, లా కాలేజీ, డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీలను ఏర్పాటు చేశామన్నారు. మెడికల్ కాలేజీ వచ్చే ఏడాది అందుబాటులోకి వస్తుందన్నారు. ఎవరూ అడగకున్నా.. ఇవన్నీ చేశామన్నారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలోఅనేక ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దామన్నారు. భవిష్యత్తులో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటుపై దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. తుక్కుగూడ ప్రాంతానికి పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి**

శంషాబాద్ నుంచి తుక్కుగూడ, కందుకూరు వరకు మెట్రోను విస్తరించేందుకు రూ.6వేల కోట్లను బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం చిత్తశుద్ధితో పూర్తి చేస్తుందని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. తుక్కుగూడ ప్రాంతానికి మరిన్ని పరిశ్రమలు రానున్నాయని, పులిమామిడి, నాగిరెడ్డి పల్లిలలో కంపెనీలను ఏర్పాటు చేయడంతోపాటు మామిడిపల్లిలో ఐటీ టవర్‌ను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. తిమ్మాపూర్ రోడ్డును నాలుగు లేన్లకు విస్తరించడంతో్ రెండు నేషనల్ హైవేలకు కనెక్టివిటీ ఏర్పడుతుందని, నియోజకవర్గంలో ఇంకా అనేక రోడ్లను విస్తరించాల్సి ఉందన్నారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లే రూట్‌లో వయా మల్లాపూర్ మీదుగా నాదర్‌గూల్, గుర్రంగూడ వరకు రోడ్డును విస్తరించే ప్రతిపాదన ఉందన్నారు. తనతోపాటు సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానన్నారు.

# మూగబోయిన మైకులు

- ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారం
- అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ప్రచారం నిర్వహించిన బీఆర్‌ఎస్ అభ్యర్థులు
- పక్కా ప్రణాళికతో ముమ్మరంగా..
- ప్రచారానికి మరింత ఊపునిచ్చిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు
- కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు వచ్చినా బీఆర్‌ఎస్‌దే అధికారమని సర్వత్రా చర్చ
- గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు సబితాఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, జైపాల్ యాదవ్, కాలె యాదయ్య, అంజయ్యయాదవ్‌లు



కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ (ఫైల్)

రంగారెడ్డి, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. ఎన్నికల్లో అందరికం టే ముందు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించగా.. ప్రచారంలో ఇతర పార్టీల కంటే బీఆర్‌ఎస్ అభ్యర్థులు దూకుడుగా ప్రచారం ని ర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గత పదేండ్లలో జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు సబితాఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, కాలె యాదయ్య, అంజయ్యయాదవ్‌లు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సఫలమయ్యారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మ్యానిఫెస్టోలోని హామీలు ప్రజలకు అందాలంటే మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ప్రచారం సందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది.

**ఆత్మీయ సమ్మేళనాలతో మద్దతు**

మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యే అభ్యర్థులు గడపగడపకూ వెళ్లి ఓటర్లను కలవడంతోపాటు అన్ని వర్గాల ప్రజలతో ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించారు. రైతులు, కూలీలు, మహిళలు, యువకులు, కుల సంఘాలతో సమావేశమయ్యారు. సాగుకు విద్యుత్తు, రైతు బంధు, రైతు బీమా, పింఛన్లు, దళిత బంధు తదితర పథకాలను వివరించి వారి మద్దతును కూడగట్టుకున్నారు. పట్టణాల్లోని కాలనీలు, బస్తీల్లో స్థానికులు, వివిధ యూనియన్ల బాధ్యులతో భేటీలు నిర్వహించారు. అపార్ట్‌మెంట్ల అసోసియేషన్లతో సమావేశమై తాగునీటి వసతి, తగ్గించిన ఇంటి పన్నులు, స్థలాల క్రమబద్ధీకరణ, డబుల్ బెడ్ రూం ఇండ్లు.. తదితర వాటిపై వివరించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను వ్యక్తిగతంగా కలిసి మరోసారి దీవించాలని విజ్ఞప్తి చేశారు.

**వాట్సాప్ గ్రూపుల్లోనూ ప్రచారం**

సోషల్ మీడియా ప్రచారానికి బీఆర్‌ఎస్ అభ్యర్థులు పెద్దపీట వేశారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో సోషల్ మీడియా బృందాలను ఏర్పాటు చేసి ప్రతి బూత్ పరిధిలోని ఓటర్లందరితో కలిసి వాట్సాప్ గ్రూపులను ప్రారంభించారు. ఇప్పటివరకు అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఏమిటి? మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేస్తాం? తదితర వివరాలను గ్రూపులతో పోస్ట్ చేయడంతోపాటు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ర్టాల్లో పరిస్థితిని ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు.

**సీఎం సభలతో కొత్త పుంతలు**

జిల్లాలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీలు రోడ్ షోలతో ఎన్నికల ప్రచారం నిర్వహించి అభ్యర్థుల్లోనూ, పార్టీ శ్రేణుల్లోనూ కొత్త జోష్ నింపారు. సీఎం కేసీఆర్ మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల, కల్వకుర్తిలలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొని ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కించారు. సీఎం ప్రచారంతో తమ విజయం ఖాయమవడమే కాకుండా.. మెజార్టీ కూడా భారీ స్థాయిలో పెరుగుతుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఆశిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థులకు మద్దతుగా జిల్లాలో ప్రధాని మోదీ, అమిత్ షా, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే తదితర నేతలు ప్రచారం నిర్వహించారు. ఏదిఏమైనా మళ్లీ అధికారం మాత్రం బీఆర్‌ఎస్‌దేనని జిల్లాల్లో సర్వత్రా చర్చ జరుగుతున్నది.